క్లుప్తంగా

ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలి


నివేదికలు చదువుతున్న డీఆర్పీలు

జూలపల్లి: గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో చేస్తున్న పనుల నిర్వహణలో పారదర్శకత, నిబంధనలు పాటించాలని ఉపాధిహామీ ఏపీడీ సత్యనారాయణ, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ అధికారి కొమురయ్య ఆదేశించారు. మండల కేంద్రంలో సోమవారం ఉపాధిహామీ16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహించిన 257 పనులకు గాను, కూలీలకు రూ.2కోట్ల 88లక్షల 85,453 చెల్లించగా, మెటీరియల్‌కు రూ.31లక్షల 31,678, మొత్తం రూ.3కోట్ల 20లక్షల 19,131 ఖర్చు చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికలు ప్రజావేదికలో సమర్పించారు. కాగా పరిశీలించి అదనంగా చెల్లించిన రూ.2,721 రికవరీకి ఆదేశించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో రోడ్ల వెంట మొక్కలు నాటాలని, తొలగించిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటి, వెంటనే నివేదికలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎంపీడీవో పద్మజ, జెక్యూసి హరికృష్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, పీఆర్ఏఈ రాజశేఖర్, ఎస్ఆర్పీ దేవేందర్, ఏపీవో సదానందం, జెఈ మల్లయ్య, డీఆర్పీలు, ఎఫ్ఏలు, కార్యదర్శులు, మేట్లు పాల్గొన్నారు.

ఎల్ఈడీ బల్బులు అందజేత


బల్బులు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి, గొల్లపల్లె గ్రామపంచాయతీలకు కమాన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఎల్ఈడీ వీధిబల్బులు పంచాయతీ కార్యదర్శులు అమీనా బాను, ప్రసాద్‌కు క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అందజేశారు. ఆగస్టు 4న రొంపికుంట గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, మచ్చగిరి రాము, జబ్బార్‌ఖాన్, గుమ్మడి అంజయ్య, అనవేన లక్ష్మీరాజం, మాజీ సర్పంచ్ శీలారపు మల్లయ్య పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్క నాటుతున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి కోరారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తా సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద గల స్థలంలో నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మాజీ కార్పొరేటర్ శంకర్‌నాయక్, సాగంటి శంకర్, మార్క రాజు, తిరుపతిరెడ్డి, చక్రపాణి, రాజేశం, వీరారెడ్డి, కిషన్ నాయక్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూప్ సాయం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు చెందిన దుర్గం శ్రీనివాస్ తల్లి దుర్గం పోచమ్మ వారం రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతిచెందింది. గతంలో శ్రీనివాస్ తండ్రి, భార్య కూడా మృతి చెందారు. గుంట భూమిలేని నిరుపేద అయిన శ్రీనివాస్ తన తల్లి అంత్యక్రియలు నిర్వహించలేని దుస్థితి. విషయం తెలుసుకున్న ధూళికట్ట గ్రామ కమిటీ వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్పందించి రూ.15,500 అతడికి అందజేశారు. వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగానే స్పందించి సాయం చేసిన దాతలకు గ్రూప్ అడ్మిన్ బత్తిని శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ మారం కొమురయ్య, భూసారపు రమేశ్‌గౌడ్, దుర్గం శంకరయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య సూచించారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో సోమవారం జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం షీటీం బృందాలు ప్రధాన కూడళ్లు, కాలేజీ ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షిసాయని పేర్కొన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సభ్యులు స్నేహలత, మౌనిక, సురేశ్, హెచ్ఎం మాధురి ఉన్నారు.

ఎండ కొడితే దుమ్ము.. వర్షం కురిస్తే బురద

- అధ్వానంగా గురుకుల విద్యాలయం ప్రధాన రహదారి


బురదమయంగా గురుకుల ప్రధాన రహదారి

రామగుండం: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రధాన రహదారి పూర్తిగా బురదమయమైంది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్టీ కాలనీ నుంచి 400 మీటర్ల దూరం వరకు గుంతలతో ఉన్న రహదారిపై మట్టితో చదును చేశారు. వర్షానికి ముందు వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము లేస్తుండడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం భారీ వర్షాలతో రహదారి పూర్తిగా బురదమయం కావడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతుండగా, పాదచారులు కనీసం నడిచి వెళ్లలేని దుస్థితి నెలకొంది.

తారు రోడ్డు నిర్మించాలి

గురుకుల విద్యాలయం మీదుగా 4మండలాలకు ప్రధాన రహదారిగా ఉండడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రద్దీ రహదారిలో 400 మీటర్ల వరకు తారురోడ్డు వేయాలి. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి తారురోడ్డు వేయించాలి. – శ్రీనివాస్, ఎగ్లాస్‌పూర్

తడి, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలి


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

ఫెర్టిలైజర్‌సిటీ: చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణంపై దుష్ప్రభావం తగ్గించాలని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సూచించారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం కార్పొరేషన్ 23వ డివిజన్ గౌతమినగర్‌లోని డీఆర్‌సీసీ కేంద్రంలో కంపోస్ట్ యార్డులలో వేస్ట్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తతో సంపద సృష్టించడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి రీసైక్లింగ్ ప్రక్రియ చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల పండుగలో ఎమ్మెల్యే


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: హైదరాబాద్ ముసారాంబాగ్ సలీంనగర్‌లో సోమవారం జరిగిన బోనాల పండుగలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీవిశ్వకర్మ శివాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు


ముస్తాబైన విశ్వకర్మ శివాలయం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవిశ్వకర్మ శివాలయ ద్విపుష్కర ప్రయుక్త వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. కాలనీ భక్తుల సహయ సహకారాలతో ఆలయం నిర్మించి ఆలయంలో శివలింగంతోపాటు దేవతామూర్తులు ప్రాణ ప్రతిష్టాపన జరిగి 24 ఏళ్లు (ద్విపుష్కర) కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 29 నుంచి 31వ వరకు నిర్వహించనున్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగుల మల్యాల రాజమౌళి ఆచార్యులు తెలిపారు.

పూజల వివరాలు..

29న ఉదయం శ్రీవిశ్వకర్మ సుప్రభాతం, వేదపారాయణం, మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పతాకావిష్కరణ, ధ్వజారోహణ, యజ్ఞశాల ప్రవేశం అగ్ని ప్రతిష్టాపన నిర్వహిస్తారు. 30న బుధవారం సహస్ర దీపాలంకరణ, 31న గురువారం సహస్ర కలశాలతో మహా కుంభాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

శ్రీవిశ్వకర్మ శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– నాగులమల్యాల రాజమౌళి, ఆలయ కమిటీ చైర్మన్

పాదయాత్ర సమన్వయ కర్తగా రాజ్‌ఠాకూర్



గోదావరిఖని: తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర, శ్రమదానం సమన్వయ కర్తగా రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను సోమవారం నియమించారు. ఈ మేరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేశ్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

ఎలిగేడు: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ మంథనికి బదిలీ కాగా మంథని డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న గిరి ఎలిగేడుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు తహసీల్దార్ యాకన్న తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం

ఎలిగేడు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన కిరణ్‌కుమార్ బదిలీ కావడంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యాకన్నతోపాటు ఆర్ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, మాజీ ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మీదుర్గయ్య ఆయనను సన్మానించారు. బావు విజయ్‌కుమార్, మండల సాగర్ పాల్గొన్నారు.

మెలకువలతో బోధన చేయాలి

పెద్దపల్లిరూరల్: సమాజంలో వస్తున్న మార్పులు, ఆధునిక సాంకేతికతను పరిగణనలోకి తీసుకుంటూ బోధన చేయాలని ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటి డీఈడీ కాలేజీలో బీఈడీ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం సోమవారం జరిగింది. ప్రిన్సిపాల్లు రెడ్డమ్మ, రజనీ, బుర్ర తిరుపతి, జైపాల్, హరి పాల్గొన్నారు. అలాగే ట్రినిటి ఇంజనీరింగ్ (అటానమస్) కాలేజీ విద్యార్థులు ఇటీవల బెంగళూరులో ఐఐఎస్సీలో పాల్గొని జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. వారిని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ప్రొఫెసర్ సమ్మయ్య సత్కరించారు. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్‌తో పాటు అశోక్, లక్ష్మి, నటరాజన్, ప్రభాకర్, రమ్య, పాషా, సురేశ్, అంబిక, వంశీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత


విద్యార్థులకు నోట్‌బుక్స్, టై, బెల్టులు, షూస్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న పూర్వ విద్యార్థులు కె.శ్రవంతి, బి.హరీశ్, చింటూ విద్యార్థులకు టై, బెల్టులు, షూలు, నోట్స్, పెన్నులు, పెన్సిల్, ప్యాడ్‌లు సోమవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతందన్నారు. ఎంఈవో మహేశ్‌కుమార్, హెచ్ఎం మధు, ఉపాధ్యాయులు సంపత్, శ్రీనివాస్, సత్యప్రకాశ్, రమాదేవి, స్వరూప, రాజమౌళి, నాగయ్య, సీఆర్పీ వీరయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ముత్తారంలో 135టన్నుల యూరియా

ముత్తారం: మండలంలోని ఎరువుల దుకాణాల్లో 135టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి అనూష తెలిపారు. మండలంలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆమె పరిశీలించారు. డీలర్లు ఈపాస్ మిషన్ ద్వారా క్రయవిక్రయాలు చేయాలని, పట్టా పాసుబుక్ ప్రకారం యూరియా సరఫరా చేయాలని డీలర్లకు సూచించారు. మండలంలోని యూరియా కొరత లేదన్నారు.

• రాజరాజేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ఉద్దండ నవీన్ శ్రావణ మాస ప్రత్యేక రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు దాతలు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ పునర్‌నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, ఆలయ ధర్మకర్తలు బెజ్జంకి రమేశ్, వెంకటరమణ, దేవసాని శంకరయ్య, అమరగాని పర్షయ్య, నోముల గోపాల్‌రెడ్డి, కొండ విజయ పాల్గొన్నారు.

• కంటి వైద్య శిబిరానికి స్పందన

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లిలో సోమవారం లయన్స్‌క్లబ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 230మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 39 మందికి కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్ ఉన్నారు.

• ఎల్‌వోసీ అందజేత

ముత్తారం: మండలంలోని జిల్లాలపల్లి గ్రామానికి చెందిన అనుముల లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. లక్ష్మి చికిత్స నిమిత్తం మంత్రి శ్రీధర్ బాబు సీఎం సహాయ నిధి నుంచి రూ.2,50,000 విలువ గల ఎల్‌వోసీ బాధిత కుటుంబానికి అందజేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని కనగర్తి, మడక గ్రామాల్లో పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా వెళ్లే వాహనాలనుత తనిఖీ చేసి ధృవపత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

• మోడల్‌స్కూల్‌లో ఆగస్టు 3వరకు అడ్మిషన్లు

ఓదెల: ఓదెల మోడల్‌స్కూల్‌లో ఆగస్టు 3వరకు ఇంటర్, 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వెంటనే కౌన్సెలింగ్ ఇస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరంతర వైద్యం అందించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులు, పీహెచ్‌సీలలో నిరంతర వైద్యం అందించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మేందర్, తిరుపతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం వారు వినతిపత్రం అందించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో దోపిడీ పెరిగిందని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఆనంద్, బాలకృష్ణ, బాబు, రమేశ్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ధర్మారం: ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్యాల శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వనపర్తి అంజయ్య, మండల బాధ్యులు నూతి మల్లయ్య, దశరథరెడ్డి, రాజేందర్‌రెడ్డి, వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాస్తు కోసం సీసీరోడ్డు కబ్జా



ముత్తారం: మండలంలోని మైదంబండలో ఓ వ్యక్తి తన ఇంటికి వాస్తు దోషం ఉందని సీసీరోడ్డుపై గోడ నిర్మించిన ఘటన గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని సంబంధిత గ్రామపంచాయతీ, మండల అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో ఈ విషయం సోమవారం పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లింది. ఈ ఘటనపై విచారణ చేపట్టి రోడ్డుకు అడ్డుగా పెట్టిన గోడను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పైపులైన్ లీకేజీలు కాకుండా చూడాలి


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: వర్షాకాలంలో పైపులైన్ లీకేజీలు కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. మున్సిపల్‌లోని 10వ వార్డులో సోమవారం వాటర్ సప్లై పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు చేస్తున్న సిబ్బందిని పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పైపులైన్ లీకేజీలు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేశారు.



రామగుండం: పట్టణంలో హౌసింగ్‌బోర్డు, భీమయ్యకాలనీ, ఈఎస్ఐ కాలనీల్లో కోతుల సంచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కార్పొరేషన్ అధికారులు కోతులను పట్టుకొని అటవీ ప్రాంతంలోకి పంపించేందుకు రూ.లక్షల నిధులు వెచ్చించినా కోతుల బెడద మాత్రం తగ్గడం లేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ స్పందించి కోతుల నుంచి కాలనీవాసులకు రక్షణ కల్పించలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

రక్షణ త్రైపాక్షిక సమావేశానికి హాజరుకావాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: రక్షణ త్రైపాక్షిక సమావేశం ఆగస్టు7న నిర్వహించనున్న దృష్ట్యా సోమవారం ఆర్జీ–2 ఏరియాలో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఏరియా కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో చేపట్టిన రక్షణ చర్యలపై సమీక్షించారు. ఏరియాలో జరిగిన ప్రమాదాలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్ అధికారులకు వివరించారు. ఆగస్టు7న జరగనున్న రక్షణ త్రైపాక్షిక సమావేశానికి అధికారులందరూ పూర్తి స్థాయి వివరాలతో హాజరు కావాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య ఆదేశించారు. సమావేశంలో రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్, అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ పెద్ది నర్సింహులు, గని ఏజెంట్ నెహ్రూ, రాజాజీ పాల్గొన్నారు.

బొగ్గు పరిశ్రమ రక్షణ కోసం బీఎంఎస్ ఉద్యమం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

రామగిరి: దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమ రక్షణ కోసం జూలై 24 నుంచి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి తెలిపారు. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో ఏరియా ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, బొగ్గు గనులను ప్రమాదరహిత గనులుగా రూపొందించాలని, బొగ్గు పరిశ్రమను కాపాడాలని దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. జూలై 24 నుంచి సెప్టెంబర్ 15 వరకు కోల్ ఇండియా, సింగరేణి, తదితర బొగ్గు ఉత్పాదక సంస్థల్లో ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ వి.వేణుగోపాల్‌రావు, బ్రాంచ్ కార్యదర్శి రౌత్ రమేశ్, సంయుక్త కార్యదర్శి విద్యాసాగర్, పిట్ కార్యదర్శి మర్రి సంతోష్, జానీ పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా చెల్లించాల్సిందే


జరిమానా వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలోని వ్యాపారులు, ప్రజలు పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని, రోడ్లపై, డ్రైనేజీల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని కమిషనర్ వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని మినీ ట్యాంకుబండ్ ప్రాంతంలో రోడ్డుపై చెత్త వేసిన వ్యాపారికి రూ.11వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. దుకాణాల్లోని చెత్తను తమ సిబ్బందికి అందించాలని, కాలువలు, చెరువు ప్రాంతం, రోడ్లపై వేస్తే చర్యలు తప్పవన్నారు. సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, ప్రదీప్ ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో కలిసి పనిచేయాలి


జెండా ఎగురవేస్తున్న నాయకులు

ధర్మారం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు కలిసి పనిచేయాలని మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మండలంలోని దొంగతుర్తి, నర్సింహులపల్లి గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు సూచించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

నూతన కాంపోజిట్ సైన్స్ ల్యాబ్ ప్రారంభం


ప్రయోగాలు పరిశీలిస్తున్న ఈడీ

జ్యోతినగర్: జ్యోతినగర్‌లోని ఎన్టీపీసీ పీటీఎస్‌లో ఉన్న శ్రీచైతన్య హైస్కూల్‌లో సోమవారం కాంపోజిట్ సైన్స్ ల్యాబ్‌తో పాటు ఇన్‌స్టిట్యూషన్‌ను ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత చేతుల మీదుగా ప్రారంభించారు. కాంపోజిట్ ల్యాబ్ ఏర్పాటుతో విద్యార్థుల్లో పరిశోధనాత్మక విజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలు, బాధ్యతలు, ప్రాముఖ్యతను తెలుసుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం.ఎస్.ఉదయ్‌కుమార్, ఎన్టీపీసీ అధికారులు ఎస్ఏ.రాజు ఉన్నారు.